# డోలిక

అతి వినయంగా చెప్పాడు బంట్రోతు.

"అయ్యగారింకా వారం రోజులవరకూ రావటానికి వీల్లేదని చెప్పమన్నారండీ. అర్జంటు పనులున్నాయట! వచ్చే బుధవారానికి తప్పక వస్తానన్నారు."

వీణాధరికీ మాటలు వినగానే ఎక్కడలేని ఉడుకుమోతుతనమూ వచ్చింది. ఇవాళ ఆయన వస్తారని ప్రత్యేకంగా తనే స్వయంగా బంగాళదుంపలు వేయించింది. ఆవడలుచేసి సిద్ధంగా ఉంచింది. సాయంత్రం ఏ సినిమాకు వెళ్ళాలో, పేపరు చూస్తుంటే ఈ కబురు.

విసుగ్గా లోపలికి వచ్చేసి మంచంమీద పడుకొన్న వీణాధరికి, పనిమనిషి ఒక కవరందించింది. పై చిరునామా, దస్తూరీ చూడగానే, ఆ ఉత్తరం, రాజారావు దగ్గిరన్నుంచని అర్థమైంది. వీణాధరికి—రెండు నెలల క్రిందట తాను వ్రాసిన ఉత్తరానికీ, ఈనాడు జవాబు. కుతూహలంగా విప్పింది.

సికింద్రాబాదు,

19—8—64

వీణాధరీ!

నీ ఉత్తరం అంది చాలా కాలమైంది. సమాధానంకూడా ఈయలేని నిస్సహాయ పరిస్థితిలో ఉన్నాను. నా కాలమంతా హాస్పిటల్‌లోనే సరి పోతుంది. వివరంగా తరువాత వ్రాస్తాను.

ఇంతే,
రాజారావు,

చదువుతూండగానే వీణాధరి చేతిలోంచి ఆ ఉత్తరం జారి క్రిందకు పడిపోయింది. శరీరమంతా స్వేద బిందువులు క్రమ్ముకొన్నాయి. ఇటీవలే ప్రారంభమయిన గుండెనొప్పి అధికమయింది.

రాజారావు హాస్పిటల్‌లో ఉన్నాడా? అతనికి జబ్బుచేసిందా? ఎప్పుడూ, కళకళలాడే చిరునవ్వుతో వెలిగిపోతూ తాను నవ్వి పది మందిని నవ్వించే రాజారావు నీరసంగా హాస్పిటల్ బెడ్‌మీద పడుకొని, నర్స్ ఇంజక్షన్ చేస్తూంటే,

ఇంక ఆలోచించలేకపోయింది వీణ. తానేం చేస్తుందో తనకు తెలియకుండా, ఇల్లంతా అనేకసార్లు కలయ తిరిగింది. ఏదో ఆవేదన గుండెలను పిండేస్తోంది. అశాంతి మనసును నిలవనీయడంలేదు. పడుకొని బలవంతాన కళ్ళు మూసుకొంది. కలకబారిన మనసు, కళ్ళ ముందుకు, ఏవో పీడాకారపు దృశ్యాలను తెస్తూంటే, దిగ్గున లేచి కూర్చుంది.

ఎలా ఉన్నాడు? అసలు బ్రతికే ఉన్నాడా? ఛీ! ఛీ! ఏట్లాంటి వూహలు వస్తున్నాయో? తా నతని నింక చూడగలదా? గుండెలు ఝల్లుమన్నాయి. ఇంక తనను తాను నిగ్రహించుకోవడం వీణాధరికి బొత్తిగా సాధ్యపడలేదు. ఒకసారి స్వయంగావెళ్ళి రాజారావును కళ్ళతో చూస్తేనే

కాని. నిలువలేననుకుంది. త్వరత్వరగా సూట్ కేస్‌లో బట్టలు సర్దుకొని, రెండు మూడు రోజులవరకూ రానని పనిమనిషితో చెప్పి రైలెక్కింది.

ఈ పాటికి హాస్పిటల్‌లో రాజారావు ఎలా ఉంటాడో ? మంచం మీద కొనప్రాణంతో పడుకొని 'వీణా!' అని కలవరిస్తుంటాడా ?

ఈ వూహ వీణాధరికి కళ్ళలో నీళ్ళు తెప్పించినా. వెంటనే, దీని లోని అవాస్తవకతకు నవ్వొచ్చింది. భగవంతుని దయవల్ల రాజారావు అట్లాంటి పరిస్థితిలోకి రాకూడదు కానీ. వస్తే, 'వీణా ?' అని కలవ రిస్తాడా ?

వీణాధరి, రాజారావు ఒకనాడు ఒకరకంగా ప్రేమికులే. వాళ్ళు విడిపోయారని అర్ధమవుతూనే ఉంది. కాని వాళ్ళు విడిపోవడానికి కారణాలు మాత్రం పాఠకులు ఊహించే, అందమైన కారణాల్లో ఏ ఒక్కటీ కాదు. వాళ్లు అత్యంత సహజంగా విడిపోయారు.

వీణాధరి, ఏంతో సంకోచంగా, వ్యంగ్యంగా తమ వివాహ ప్రస్తావన చేసినపుడు, రాజారావు తేలిగ్గా నవ్వేశాడు.

"వీణా! నాకు నువ్వంటే ఇష్టం లేకపోలేదు. కానీ, పెళ్ళి విషయంలో, నాకు చాలా ఆశలున్నాయి. చాలా డబ్బు. అంతకంటే ముఖ్యంగా పలుకుబడి, ఉన్నవారి అమ్మాయి, ఏదో అసాధారణమైన ఆకర్షణ, కనీసం చైతన్యవంతంగా నన్ను కవ్వించగలిగేపాటి తెలివి తేటలూ, కలది నా భార్య కావాలని కోరుకుంటున్నాను. ఇందుకు నా అర్హత లేపాటివనేది వేరో సంగతనుకో. అయినా అర్హతలకూ ఆశలకూ సంబంధమేమిటి ?

ఈ మాటలు విని వీణాధరి నిర్ఘాంతపోలేదు. కనీసం ఆశ్చర్యాన్నిగూడా పొందలేను. "జీవితం జీవించడానికి చదవటానికి కాదు" అనే రాజారావు ఇలా మాట్లాడటంలో అనుకోవలసిందేముంది ?

దుఃఖాన్ని నిగ్రహించుకోవడానికి మాత్రం వీణాధరి పెద్ద ప్రయత్నమే చెయ్యవలసి వచ్చింది.

ఏడవబోయే పెదిమలతో, చిరునవ్వు నవ్వి విష్‌యూ బెస్ట్ ఆఫ్ ది లక్" అని చెప్పి, అతని జీవితంలోంచి వచ్చేసింది. తరువాత ఆ దెబ్బనుండి కోలుకోవడానికి వీణాధరికి చాలా రోజులే పట్టింది. పిచ్చి పిచ్చిగా ఏవో ఆత్మ హత్యా ప్రయత్నాలు చేసిందని కూడ చెప్పుకొన్నారు.

ఏమయితేనేం కాని, చివరకు, వీణాధరి లక్షణంగా పెళ్ళి చేసికొంది. పెళ్ళికి రాజారావు కూడా వచ్చి వధూవరులకు తన శుభాకాంక్షల నందజేశాడు. ఆ తరువాత కూడా, వీణాధరి రాజారావు నెన్నడూ మరిచిపోలేదు. అసలు మరిచిపోయే ప్రయత్నం కూడా చెయ్యలేదు. కానీ, అతి ప్రయత్నం మీద తనను తాను సంస్కరించుకో గలిగింది. అవును! అతడు అసాధారణమైన వ్యక్తి. ఇదమిద్ధ మనరాని ఏదో అపూర్వాకర్షణ అతనిలో ఉన్నమాట వాస్తవం. అట్లాంటి వ్యక్తిని ఆకట్టుకోవడానికి కూడా అసాధారణమైన వ్యక్తులే ఉండాలి. తానతిసాధారణమైనది. అతని మనసులో స్థానాన్ని పొందడానికి ప్రయత్నించీ ప్రయోజనం లేదు. తన అర్హతకు తగిన—ఇంకా ఎక్కువగానే—ఫలాన్ని పొందగలిగింది తాను. రాజారావు తన ఆశలన్నీ సఫలమయ్యేలాగ, తాను కోరిన కన్యను వివాహమాడుతాడు గాక! అతి ప్రయత్నం మీద తన గుండెనీ మాత్రం పెద్దది చేసుకోగలిగాక, వీణాధరి కళ్ళలో నీళ్ళు పూర్తిగా మాయమయ్యాయి. రాజారావు స్మృతి ఇప్పుడామెకు దుర్భరవిషాదాన్ని కలుగజెయ్యటం లేదు. అతని నొక ఆత్మీయుడైన స్నేహితునిగా భావించ గలుగుతూంది. అట్లాంటి వ్యక్తి స్నేహాన్ని పొందగలగటం, ఒక అదృష్టమని నమ్మగలుగుతూంది.

రైలు కాజీపేట చేరుకుంది. కాఫీ, టీ వగైరా కేకలకు ఉలిక్కి పడింది వీణాధరి. అరుణోదయ మవుతూంది. లేచి ముఖం కడుక్కుందా మనుకొని, లేవలేక బద్ధకంగా అలానే కూర్చుంది వీణ.

ఎన్నెన్ని రకాలుగా ఆలోచిస్తున్నా, తిరిగి తిరిగి మనసు రాజా రావు అస్వస్థతమీదికే మళ్ళుతుంది.

దాంపత్య జీవితంమీద గంపెడాశలు పెట్టుకొన్న రాజారావు అసలు పెళ్లే చేసుకోలేదు. ఆ విషయం తా నెన్నిసార్లు ప్రశ్నించినా, ఎన్నడూ సరయిన సమాధానం పొందలేకపోయింది. అతని కలల బాల అతనికి సాక్షాత్కరించనేలేదో లేక తారసిల్లిన అపురూపసుందరి అతనిని తిరస్కరించిందో—ఏం జరిగిందో వీణాధరి వూహించలేకపోయింది. కారణాంతరమైనా, ఇప్పటికీ అతడు జంటలేని ఒంటిగా మిగిలిపోయాడు. పాపం! ఈనాడు ఒంట్లో ఇంత అస్వస్థతగా ఉన్నప్పుడు ప్రేమగా అతని నాశ్వాసించే హస్తం లేదు. అతని కష్టసుఖాలను తనవిగా చేసుకోగలిగే మరొక ప్రాణిలేదు. కనీసం, అతనికి సాధారణ సదుపాయాలు చూడ గలిగే తోడుకూడా ఎవరూలేరు.

రైలులో మిగిలిన ప్రయాణీకులు చూస్తారేమోనని ముఖం తుడుచుకునే వంకతో, గబగబ కళ్ళు తుడుచుకొంది వీణాధరి.

తాను వెళ్లేటప్పటికి ఎట్లాంటి దృశ్యాలు ఎదురవుతాయో? ఎంత జబ్బుగా ఉన్నాసరే, సజీవుడయి ఉంటేచాలు. అతనిని తాను బ్రతికించుకోగలదు. అతని జబ్బు పూర్తిగా నయమయేవరకూ అతని దగ్గరే ఉంటుంది. ఇట్లాంటి పరిస్థితిలో అతని ఖర్మకు అతనిని వదిలి వేయగల శక్తి తనకులేదు. సంఘమూ, పరువూ ప్రతిష్ఠ, తన సంసా రమూ ఇవన్నీ వీణాధరి మనసులోకి రాకపోలేదు. ఏది ఎలా జరిగినా సరే! సంఘమంతా తనను దుమ్మెత్తి పోసినాసరే! తనకు పరువు ప్రతిష్ఠ

లేమీ మిగలకపోయినాసరే! తన సంసారం నాశనమయినాసరే రాజా రావును మాత్రం జబ్బులో ఒదిలి రాలేదు. అతడే పొమ్మన్నాసరే!

రిక్షా దిగిన వీణాధరికి కూనిరాగంతీస్తూ తల దువ్వుకొంటూ రాజా రావు ఎదురయ్యేసరికి శిలాప్రతిమలా నిల్చుండిపోయింది. తలవని తలం పుగా వీణాధరిని చూసి రాజారావూ అంతే ఆశ్చర్యపోయాడు.

"నువ్వు .. నువ్వు బ్రతికే ఉన్నావా?" విభ్రాంతితో అడిగింది వీణాధరి.

"దురదృష్టవంతుణ్ణి" నవ్వుతూ అన్నాడు రాజారావు.

వీణాధరికి తాను మాట్లాడిందేమిటో తెలిసివచ్చి నాలుక కరచుకుంది.

"జబ్బేమయిందీ?"

"ప్రాణం పోతుందంటే నా కంత భయంలేదు. కానీ జబ్బులు మాత్రం ఇష్టంలేదు. కానీ, నీ రాకేమిటి? వస్తూనే, ఈ కుశల ప్రశ్న లేమిటి? అలా కూర్చో, కాఫీ త్రాగావా? ఏమైనా పైత్యం చేసిందా?"

"పిచ్చెక్కింది. నాకు కాకపోతే, నీకు. ఆ ఉత్తరం ఎందుకలా వ్రాసావ్?"

"ఏ ఉత్తరం? నేను చచ్చిపోయానని వ్రాసానా" ఆశ్చర్యంగా అడిగాడు రాజారావు.

వీణాధరి ముఖం ఎర్రబడగా, తల వంచుకొని నవ్వుకొంది. రాజా రావు ఇలా నవ్వుతూ యధాప్రకారం కళ్ళబడేసరికి, అంతవరకూ రగిలి పోతున్న వీణాధరి హృదయం చల్లబడింది. అంతవరకూ, తాను పొందిన అలసట, అప్పుడనుభూతమై, కుర్చీలో నీరసంగా వెనక్కు వ్రాలి "హాస్పిటల్‌లో ఉన్నాననీ. నాకు సమాధానంకూడ ఇయ్యలేని పరిస్థితులలో ఉన్నాననీ వ్రాసావు. గుర్తులేదూ? అది చదివి ఎంత బాధ పడ్తున్నావోనని పరుగెత్తుకొచ్చాను" అంది.

"ఓ అదా! నాకు పెద్ద ఉత్తరాలు వ్రాయాలంటే విసుగు. అసలు ఉత్తరాలు వ్రాయాలంటేనే విసుగు. నీ బాధ పడలేక నీకు సమాధానం వ్రాసాను. మా చెల్లెలు హాస్పిటల్‌లో ఉంది. అందుకని నాకు తీరికలేదని వ్రాసాను "

"హమ్మయ్య! దారి పొడుగూతా ఎంత బాధపడ్డాననుకున్నావ్. ఏమైనానరే, ఇంక నీ దగ్గరే ఉందామని నిశ్చయించుకొని వచ్చాను."

"నీ అమ్మ కడుపు చల్లగా ముందే చెప్పావు. ఇంకా ముందు నాకెంత పెద్దజబ్బు చేసినా, పొరపాటునకూడా నీకు వ్రాయను. అయినా, ఇలా వచ్చెయ్యటమేమిటి? అన్నింటికీ తొందరే నీకు..."

వీణాధరికి రోషమొచ్చింది.

"అంత కానిపాడుపనేం చేశాను?"

"ఏది పాడుపనో. ఏది మంచిపనో నిర్ణయించే వాళ్ళం మనం కాదు. మనకు శ్రమలేకుండా, కొందరు బుద్ధిమంతుల్లా పనిచేసి పెట్టే శారు. ఆ ప్రకారం నడవటమే మన వంతు. ఇప్పు దేడుపు మొదలు పెట్టకి వెళ్ళి స్నానం అదీ చూసుకో. మా అత్తయ్య హాస్పిటల్‌కు వెళ్ళింది. ఇప్పుడే వస్తుంది. తను వచ్చాక భోజనాలు చెయ్యోచ్చు. వంట అయిపోయిందనుకుంటాను."

"ఇంకా ఏం ఏడుస్తానూ? దారిపొడుగుతా ఏడ్చేశాను."

"వెరీగుడ్! నన్ను బ్రతికించావు. స్నానాల గది అటు ప్రక్క ఉంది."

రాజారావు స్నానాలగది చూపించాడు. వీణాధరి స్నానంచేసి వచ్చేసరికి. రాజారావు మేనత్త వచ్చేసింది. వీణాధరిని పైనుంచి క్రిందకు పరిశీలనగా చూస్తూ "ఎవరురా?" అంది.

"మనకు కావలసినవాళ్లు'' నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు రాజారావు.

ఆవిడ మరొకసారి వీణాధరివంక గ్రుచ్చిగ్రుచ్చి చూసి లోపలకు వెళ్ళిపోయింది.

ఆమె వెయ్యబోయే ప్రశ్న పరంపర వూహించుకొని వీణాధరి గుండెలు ఝల్లుమన్నాయి. జడ్జిముందరి ముద్దాయిలా వణికిపోయింది.

"నేను రాత్రి బండికి వెళ్ళిపోతాను."

"రెండు రాత్రులు వరసగా నిద్రలేకుండా ఉండగలవా?"

"ఫరవాలేదు. ట్రెయిన్‌లో చోటు దొరికితే నిద్రపోతాను.''

"అయితే సరే! భోజనానికిరా! అత్తయ్యా! మా యిద్దరికీ వడ్డించు."

"ఇద్దరికీనా?" అవిడ నొక్కి అడిగింది.

"ఆ! ఇద్దరికీ." అంతకంటె దృఢంగా అన్నాడు రాజారావు.

వీణాధరి కుంచించుకొని పోతూంటే. తాను చేసినదంతా అనాలోచిత కార్యమని ఇప్పుడర్థం కాసాగింది.

"పోనీ, నువ్వు తినేసెయ్యి. తరువాత నేనావిడతో తింటాను'' అంది బెదురుగా.

"బాగుంది! నువ్వు మా చెల్లిని చూడటానికి రావా? ఇప్పుడు నేను హాస్పిటల్‌కు వెడుతున్నాను. నువ్వింతదూరం వచ్చింది దేనికి?''

వీణాధరి ఇంకేం మాట్లాడలేదు.

హాస్పిటల్‌కు వెడుతూ దారిలో వీణాధరి నవ్వుతూ, "మీ మేనత్త గారు ఏమేమి అడుగుతారోనని హడలిపోయాను" అంది.

"ఆవిడకా అవకాశం లేకుండా చేసాను గదా. నువ్వెందు కింత కంగారుగా వచ్చావ్."

"చెప్పానుగా! నీకే బాగులేదనుకొన్నాను. మతిపోయింది. ఉన్న దాన్ని ఉన్నట్లు వచ్చేశాను. పోనీ! మీ చెల్లెల్ని చూసినట్లవుతుంది."

రాజారావు మనసెంతో ఆర్ద్రమయింది. తనకోసం, ఆమె అంత ఆవేదనతో వచ్చేసరికి, సహజంగా ఆమెపట్లవున్న అభిమానం మరింత కాదా. ఆర్ద్రస్వరంతో "పోనీలే! ఇలానయినా నిన్ను చూసాను." అన్నాడు.

వీణాధరి ఏం మాట్లాడలేదు.

"ఇంకా ఏమిటి విశేషాలు" అన్నాడు రాజారావు మళ్ళీ.

"విశేషాలా ఏమున్నాయ్! మావారు కేంప్‌నుంచి నిన్న రావలసింది. వచ్చే బుధవారంవరకూ రానని కబురు చేశారు. ఎక్కడి పనులో బాబూ!"

"అలాగా! అయితే, ఆయన తరచు కేంప్స్‌లో ఉంటారన్న మాట!"

"ఆ, తరచు వెళ్తూనే ఉంటారు. వూళ్లో ఉన్నప్పుడు మాత్రం ఎంత సరదాగా ఉంటారనుకొన్నావ్. ఒట్టి చిలిపి. ఎప్పుడూ, ఏదో అల్లరిచేస్తోనే ఉంటారు. ఇంక సాయంత్రమయిందంటే, ఎక్కడికో ఒక చోటికి బయలుదేరతీస్తారు. తను కేంప్ వెళ్ళినపుడు మాత్రం పిచ్చెక్కినట్లే ఉంటుంది"

ఏదో లోకంలో ఉన్నట్లు చెప్పుకుపోతూంది వీణాధరి. ఆమె వాక్ప్రవాహానికి అడ్డు తగలకుండా 'వూ! వూ!' అంటున్నాడు రాజారావు.

"బయటినుంచి వస్తూనే 'వీణా!' అంటూ కేకలు. పనివున్నా లేక పోయినా, 'వీణా! వీణా!' అని పిలుస్తూనే ఉంటారు. ఒక్కొక్కసారి విసుగేస్తుంది. కానీ. ఒక్క క్షణం తను లేకపోతే తోచదు. నాకు కొద్దిగా ఒళ్ళు వెచ్చగావున్నా, బెంబేలెత్తిపోతారు. ఇంక ఆ హడావుడి, గాభరా, చెప్పలేం. మరీ అంత వెర్రినిటో"

భర్త్రుస్మృతులతో మధురంగా నవ్వుకొంది వీణాధరి. ఆమె ధోరణికి విస్తుపోతూ 'గుడ్!' అన్నాడు అన్యమనస్కంగా రాజారావు.

వీణాధరి మళ్ళీ ప్రారంభించింది.

"మరీ, పసిపిల్లాడి తంతు? తనకు కావలసిందికూడా, తనకు తెలియదు. చివరకు తన ఆకలి తనకు తెలియదు. భోజనం సంగతి నేను గుర్తుచెయ్యాలి."

"మేజోళ్ళు నేను రెడీగా పెట్టాలి. ఇంక ఫలహారం చెయ్యడానికి ఎన్నితిప్పలు పెడతారో చెప్పలేను. టిఫిన్ ప్లేటు ఒకవారకి పడేసి, ఆ సంగతి మర్చిపోయి, మరో పనిలో మునిగిపోతారు. ఆ ప్లేటు చేతిలో పెట్టుకొని, మూవింగ్ టేబిల్‌లాగ తనకూడా తిరగాలి. లేకపోతే రాత్రి వరకుకూడా దాని సంగతే మరిచిపోతారు.

రాజారావుకు విసుగేస్తూంది 'ఊ!' అన్నాడు మూలుగుతూన్నట్లు.

వీణాధరి అప్పటికీ ఆపలేదు. ఆమె భర్త్రుపాదుల దివ్యగుణ సంకీర్తనలతో పరవశత్వం పొందుతూంది.

రాజారావు పూర్తిగా వినటం మానేశాడు. ఎప్పుడైనా అన్యమనస్కంగా, వూ అనో, ఆ అనో, అలాగా అనో, మాత్రం అంటున్నాడు. తన ధోరణిలో తాను చెప్పుకుపోతున్న వీణాధరికి రాజారావు వింటున్నాడో, లేదోకూడా పట్టినట్లులేదు.

రాజారావు చెల్లెల్ని చూసి ఆమె దగ్గిర తాను కొనితెచ్చిన పళ్ళు నుంచి, కొంచెంసేపు సానుభూతిగా మాటలాడి, రాజారావు వెంటరాగా, హాస్పిటల్‌నుండి తిరుగుముఖం పట్టింది వీణాధరి.

వచ్చేటప్పుడంతా, తన శ్రీవారి గురించి చెప్పిన విశేషాలు విని విని విసుగెత్తిన రాజారావు, ఏదో మాటలాడబోతుండగా దారి ప్రక్కన గులాబీపూలను చూసి వీణాధరి అందుకొంది.

''మా వారికి గులాబీలంటే ఇష్టం. నాకు సన్నజాజులంటే ఇష్టం. నా కోసం సన్నజాజులుకూడా తెస్తారనుకో! అయినా, రోజూ యిన్ని గులాబులు కొని తీసికొనివస్తారు, పువ్వులంటే ఎంతో మమకారం. మా ఇంట్లో చిన్న తోట ఉంది. ఆయన స్వయంగా...''

గడగడ మాటలాడుతున్న వీణాధరి నోరు గట్టిగా నొక్కి పారేద్దామన్నంత కసి కలిగింది రాజారావుకు.

సభ్యత తెలిసినవాడు గనుక, చచ్చినట్లు వీణాధరి మాటలన్నీ విన్నాడు. కనీసం విన్నట్లు నటించాడు.

ఆ సాయంత్రం ఆమెను రైలెక్కించిన తరువాత తాను ప్లాటుఫారంమీద నిలబడి, రాజారావు "నువ్వు వెళ్లేసరికి మీవారు రారనుకొంటానేం?" అన్నాడు.

"అవును రారు:" దిగాలుగా అంది వీణాధరి.

"హమ్మయ్య! అయితే నువ్విలా వచ్చినట్లు ఆయనకు తెలుసే అవకాశంలేదు" అన్నాడు రాజారావు.

వెంటనే వీణాధరి ముఖం జేవురించింది.

"ఎందుకులేదూ నేనే చెప్తాను. నేనేమంత ఘోరం చేశానని దీన్ని పరమ రహస్యంగా ఉంచడానికి! మా వారికి నామీద సంపూర్ణమైన

విశ్వాసం ఉంది. నేను జరిగింది జరిగినట్లు చెప్తాను. ఒకవేళ వారికి తప్పనితోస్తే తొయ్యనీ! వారువేసే ఏ శిక్షనయినా సంతోషంగా భరిస్తాను. ఒక పని చెయ్యటానికి సాహసమున్నప్పుడు, ఫలితా న్ననుభవించే ఓపికకూడా ఉండాలి, అంతేకాని, ఆయన దగ్గిర నేనేం దాచను."

రాజారావు విస్తుపోయాడు. మనసులో నీ కర్మ! అనుకొని "మంచిది అలాగే చెయ్యి!" అన్నాడు.

అంతలో లైట్లు వెలిగాయి. వీణాధరి చటుక్కున తన మాంగల్యాలను తీసి కళ్ళ కద్దుకొంది. రాజారావది చూసి చాలా ఆశ్చర్యపోయాడు. వీణాధరికి మాత్రం తానేం చేస్తున్నదో తనకు తెలియదు. అదొక అసంకల్పిత ప్రతీకార చర్య. తరతరాలుగా రక్తంలో జీర్ణించుకుపోయిన ఒకానొక సంప్రదాయపు గుర్తు

రైలు బిగ్గరగా కూస్తూ కదిలింది. వీణాధరి కనబడినంతసేపూ చెయ్యి వూపి, వెనుదిరిగాడు రాజారావు.

వీణాధరి రాకా, ఆమె రాకలోని ఉద్దేశ్యం తీరా, వచ్చిన తరువాత ఆమె తీరూ, అంతా విచిత్రంగా అనిపించింది రాజారావుకు. లైట్లు వెలగగానే, ఆమె తన మాంగల్యాలను కళ్ళకద్దుకోవటం గుర్తుకొచ్చింది. ఆ దృశ్యం మనసులో తలచుకోగానే, అతనికిలా అనిపించింది

"వీణాధరి మనసు ఒక డోలిక లాంటిది. గాలి తాకిడికి డోలిక వెనుక ముందులకు వూగినా, అది స్థిరత్వాన్ని పొందేది మాత్రం అది బంధింపబడిన శాఖ నాశ్రయించుకొనే: వీణాధరి మనసు మాంగల్యాలనే సూత్రాలతో ఆమె భర్త అన్నె కేంద్రానికి బంధింపబడింది. ఉద్వేగ ఝంఝామారుతా లామె మనసు నెట్టటువూపినా, చివరి కామె, తన భర్త నాశ్రయించుకొని మాత్రమే ప్రశాంతిని పొందగలదు.

*సమాప్తం*